
సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 14 । నవంబర్ । 2023



ధూంధాం దీపావళి

దీపావళి పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. 8లో



భరోసా.. బాధ్యత

జగనన్న విద్య, వసతి దీవెన పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. 8లో



మద్యం దుకాణానికి నిప్పు

తనకు కావాల్సిన బ్రాండ్ మద్యం లేదన్నందుకు ఆగ్రహించి మద్యం షాపునకు నిప్పుపెట్టాడు ఓ మందుబాబు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



మహారాణిపేట: కార్తీక మాసోత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం నుంచి నెల రోజుల పాటు కార్తీక మాసం పూజలు నిర్వహణకు దేవదాయ శాఖ ఉప కమిషనర్ సుజాత పర్యవేక్షణలో జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష సన్నాహాలు చేశారు. ప్రధాన ఆలయాల వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్లు, శానిటేషన్ ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాదాల పంపిణీ, మంచినీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయానికి చర్యలు తీసుకున్నారు. కార్తీక మాసంలో విధులు నిర్వహించడానికి సుమారు 100 మంది సిబ్బందిని వివిధ ఆలయాల్లో డిప్యుటేషన్‌పై నియమించారు. మంగళవారం సాయంత్రమే పలు ఆలయాల్లో ఆకాశ దీపాలు వెలిగించి కార్తీక మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 20న మొదటి కార్తీక సోమవారం, 23న తొలి ఏకాదశి, 25న శనిత్రయోదశి, 27న రెండో సోమవారం, డిసెంబర్ 4న మూడో సోమవారం, 11న నాలుగో సోమవారం, ఈ నెల 26న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం, 11న మాస శివరాత్రి, 12న అమావాస్య, 13న పోలి పాడ్యమి నిర్వహించనున్నట్టు శిరీష తెలిపారు.


రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు



రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న రైల్వేబోర్డు అడిషనల్ మెంబర్ సీమాకుమార్

తాటిచెట్లపాలెం: రైల్వే బోర్డు, అడిషనల్ మెంబర్(టూరిజం అండ్ కేటరింగ్), ఐఆర్‌సీటీసీ సీఎండీ సీమాకుమార్ సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. అనంతరం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, గతిశక్తి ఉన్నతాధికారులతో సమావేశమై స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల వల్ల ప్రయాణికులకు, రైళ్లరాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. భద్రత, నాణ్యతపై దృష్టి సారించాలని గతిశక్తి అధికారులను ఆదేశించారు. అనంతరం ఐఆర్‌సీటీసీ అధికారులతో సమావేశమై తదుపరి తీసుకోవలసిన అభివృద్ధి చర్యల గురించి చర్చించారు. ఆమెతోపాటు డీఆర్‌ఎం, స్టేషన్ డైరెక్టర్, డివిజన్ ఉన్నతాధికారులు ఉన్నారు.

అప్పన్న ఆలయం శ్లాబ్ లీకేజీపై అధ్యయనం



అప్పన్న ఆలయం పైభాగంలో శ్లాబ్‌ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ ప్రశాంత్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం శ్లాబ్ లీకులపై సోమవారం తిరుపతికి చెందిన ఐఐటీ ప్రొఫెసర్ ప్రశాంత్ అధ్యయనం చేశారు. వర్షం పడితే ఆలయ పైభాగం నుంచి నీరు కారుతోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు దేవస్థానం అధికారులు ప్రొఫెసర్ ప్రశాంత్‌ని సంప్రదించారు. ఈ మేరకు ఆయన సింహగిరికి వచ్చి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆలయ పైభాగాన్ని పరిశీలించారు. డ్రిల్లింగ్ మిషన్‌తో పలు చోట్ల శ్లాబ్ ముక్కలను కట్ చేసి తిరుపతికి తీసుకెళ్లారు. వాటిని పరిశీలించిన తర్వాత నివేదిక ఇవ్వనున్నారు. అనంతరం నివారణ చర్యలు ప్రారంభించనున్నారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

16న మైనార్టీ కమిషన్ రాక

మహారాణిపేట: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, వైస్ చైర్మన్ ఆదిపి జాషువా డేనియల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైఫుల్లా, జితేందర్ సింగ్ ఈ నెల 16న విశాఖ రానున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషన్ చైర్మన్ ఇక్బాల్ ఒక ప్రకటనలో కోరారు.

రాత్రి విమానాలకు బ్రేక్





- రేపటి నుంచి మార్చి 31 వరకు విశాఖ ఎయిర్‌పోర్టులో రీ–సర్ఫేసింగ్ పనులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత
- అందుకనుగుణంగా విమానాల వేళల్లో మార్పులు
- కేవలం మూడు విమాన సర్వీసులే రద్దు
- విమానయాన సంస్థల వింటర్ షెడ్యూల్ ఖరారు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం అర్ధరాత్రి నుంచి నాలుగున్నర **నెలలు** రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో 11 గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఐఎన్ఎస్ డేగా నియంత్రణలోని రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తుంటాయి. పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు కూడా ఈ రన్‌వే మీదుగానే జరుగుతుంటాయి. రక్షణశాఖ పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ–సర్ఫేసింగ్ పనులు చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు. ఇంతకుముందు ఐఎన్ఎస్ డేగాలో 2009లో రీ–సర్ఫేసింగ్ నిర్వహించారు. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది రీ–సర్ఫేసింగ్‌ను నవంబరు 15 నుంచి మార్చి నెలాఖరు వరకు చేపట్టాలని రక్షణ శాఖ నిర్ణయించింది. ఈ పనులను రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేస్తారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివేస్తారు. దీంతో ఈ 11 గంటల్లో ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ప్రస్తుతం ఈ విమానాశ్రయం నుంచి రోజూ 30 వరకు టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి. రీ–సర్ఫేసింగ్‌తో 12 విమాన సర్వీసులు రద్దవుతాయని తొలుత భావించినా సర్దుబాట్ల అనంతరం మూడు (ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు) విమాన సర్వీసులే రద్దయ్యాయి

సమయాన్ని తగ్గించాలని కోరినా..

విశాఖ ఎయిర్‌పోర్టులో రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత సమయాన్ని తగ్గించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు తదితరులు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కార్యదర్శి గిరిధర్‌లతో పాటు తూర్పు నావికాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్‌కు విజ్ఞప్తి చేశారు. కానీ రక్షణ రంగ కార్యకలాపాలు, ప్రయాణికుల భద్రత, సౌలభ్యం దృష్ట్యా అది సాధ్యం కాదని ఈఎన్‌సీ చీఫ్ స్పష్టం చేశారు. అయితే పగటి పూట మరిన్ని విమానాలు నడవడానికి టైం స్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందుకోసం ఏటీసీలో మరింత మంది సిబ్బందిని పెంచడానికి సిద్ధమని చెప్పారు. దేశంలోని ఇతర విమానాశ్రయాల్లో కంటే విశాఖ ఎయిర్‌పోర్టు రీ–సర్ఫేసింగ్‌కు ఎక్కువ సమయం తీసుకోవడానికి సమాంతర ట్యాక్సీ ట్రాక్ లేకపోవడమేనని రక్షణశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా రీ–సర్ఫేసింగ్‌కు అవసరమైన కసరత్తు పూర్తయిందని, ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

షెడ్యూల్ వేళల మార్పు

రీ–సర్ఫేసింగ్ నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే విమానాల వేళలను సర్దుబాటు చేసుకోవాలని సంబంధిత విమానయాన సంస్థలకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దీంతో ఆయా సంస్థలు తమ విమానాల వేళల మార్పుతో పాటు వింటర్ షెడ్యూలు ఖరారు చేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 తర్వాత నుంచి ఈ విమానం మూడు గంటలు ముందుగా రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి.

పర్యాటక సీజన్ వేళ

ఏటా పర్యాటక సీజన్ ఆరంభమయ్యే అక్టోబర్ నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. నాలుగైదు నెలల పాటు విమానాలకు పర్యాటకుల తాకిడి కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజన్‌లో పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజన్‌లోనే రీ–సర్ఫేసింగ్ పనులు మొదలవుతుండడంతో ఎక్కువ విమాన సర్వీసులు రద్దవుతాయని పర్యాటకులు ఆందోళన చెందారు. కానీ మూడు విమాన సర్వీసులే రద్దు కావడంతో ఒకింత ఊరట కలగనుంది.



ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్ (ఫైల్)

15న స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల స్థాయీ సంఘ సమావేశంలో నిర్వహించనున్న సమావేశానికి 23 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

- బీచ్‌రోడ్డులో ఆర్కే బీచ్ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న విగ్రహాలు, విగ్రహ పీఠాలకు ఫోకస్ లైట్లు ఏర్పాటు
- జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో కల్యాణ మండపం నిర్మాణం
- జోన్–7 పరిధి 82వ వార్డులో ఎన్టీఆర్ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ జిమ్ నిర్మాణానికి పరిపాలనా పరమైన ఆమోదానికి, టెండర్లు పిలిచేందుకు..
- వేపగుంటలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి 30 కేఎల్‌డీ శుద్ధి చేయబడిన నీటిని సరఫరాకు గాను పైపులైన్ వేసేందుకు..
- బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ మూడేళ్ల కాలానికి మెయింటెనెన్స్ చేసేందుకు పిలిచిన రిక్వెస్ట్ ఫర్ పర్సనల్ ఆర్థిక ప్రతిపాదన
- గాజువాక జోన్ 73వ వార్డు సింహగిరి కాలనీ వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల ఏర్పాటు
- అనకాపల్లి జోన్ ప్రధాన రహదారి ఎన్టీఆర్ విగ్రహం వద్ద జంక్షన్ విస్తరణ.
- గాజువాక జోన్ 64 నుంచి 79 వార్డులు, 85 నుంచి 88 వార్డుల్లో రాత్రి వేళల్లో ప్రధాన రహదారుల పారిశుధ్య నిర్వహణకు మూడు నెలల కాలానికి అదనపు సిబ్బంది నియామకం.
- 47వ వార్డు కప్పరాడలో సెయింట్ మదర్ థెరిస్సా విగ్రహానికి మరమ్మతులు చేపట్టేందుకు..
- జోన్–2 పరిధి 12, 13 వార్డుల్లో సూర్య తేజ నగర్ బ్రిడ్జి నుంచి శ్రీకాంత్ నగర్ కల్వర్టు వరకు ఎంఎస్ చైన్ లింక్ మెష్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు
- బీచ్‌రోడ్డు 8వ వార్డు సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులో గల కాళీమాత గుడికి ఆనుకొని ఉన్న స్థలం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టేందుకు తదితర అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

విశాఖ చేరిన గురునాథ్ పాదయాత్ర



గురునాథ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ తదితరులు

- జగన్ మళ్లీ సీఎం కావాలంటూ తిరుపతికి కాలినడకన
- జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘన సత్కారం

కొమ్మాది: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన గురునాథ్ యాదవ్ చేపట్టిన పాదయాత్ర సోమవారం విశాఖపట్నం చేరుకుంది. శ్రీకాకుళం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఈ పాదయాత్ర సాగనుంది. ఇందులో భాగంగా సోమవారం గురునాథ్ ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. అనంతరం గురునాథ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ సీఎం వైఎస్ జగన్ ముందుగు సాగుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుతం జగనన్న సుపరిపాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ ఈ పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని, అందుకు శ్రీవేంకటేశ్వరస్వామి దీవెనలు ఉండాలని వేడుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం విలువ చాటేలా..!

- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
- ఈ నెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



పోస్టరు ఆవిష్కరిస్తున్న వెంకటరావు, తదితరులు

డాబాగార్డెన్స్/విశాఖ విద్య: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు తెలిపారు. సోమవారం గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో వారోత్సవాల ప్రచార పోస్టర్లు, బ్యానర్స్, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వివరాలను వెల్లడించారు. విశాఖ నగరంలోని సూర్యబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వేదికగా వారోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు

వారోత్సవాల షెడ్యూల్ ఇదీ...

- ఈ నెల 14న బాలల దినోత్సవం రోజు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తారు.
- 15న పుస్తక ప్రదర్శనతోపాటు మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించనున్నారు.
- 16న ఉదయం 10 గంటలకు గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం, గ్రంథాలయ ఉద్యమ నాయకులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథం, అయ్యంకి వెంకటమరణయ్య, పాతూరి నాగభూషణం తదితరులకు నివాళులర్పించుట, గ్రంథపాలకుల సదస్సు నిర్వహించనున్నారు. అనంతరం లైబ్రేరియన్ ఎస్ఎల్ రాజేంద్రవర్మ నిర్వహణలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 'విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర'పై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు.
- 17న సాయంత్రం గరిమ సాంస్కతిక వేదిక సారథ్యంలో కవి సమ్మేళనం.
- 18న గ్రంథాలయ సభ్యత్వ దరావతు స్వీకరణ. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఆటలు, దేశభక్తి గేయాల పోటీలు.
- 19న ఉదయం 10 గంటలకు గరిమ సాంస్కృతిక వేదిక సారథ్యంలో మహిళా దినోత్సవం నిర్వహణ. దిశ చట్టం, మహిళా సాధికారితపై సదస్సు.
- 20న ఉదయం స్టవుయ్ లవ్ రీడింగ్‌కి కిలో భాగంగా సామూహిక స్వీయ పుస్తక పఠనం, అనంతరం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తారు.

నేడు వారోత్సవాలు ప్రారంభం

గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభించనున్నామని, బాలల దినోత్సవం, జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ కొండా రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, వయోజన విద్యాశాఖ సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఇన్‌చార్జి, ఉప గ్రంథాలయ అధికారి పి.వి. నూకరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 19న విశాఖ- రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, ఈ నెల 20న రాయగడ-విశాఖ(08503) పాసింజర్ స్పెషల్, ఈనెల 20న విశాఖ-కోరాపుట్ (08546/ 08545) పాసింజర్ స్పెషల్ రైళ్లు ఇరువైపులా, ఈనెల 20న విశాఖ-కోరాపుట్ (18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, ఈనెల 21న కోరాపుట్ -విశాఖ (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

ఈ నెల 16న హౌరాలో 8.30 గంటలకు బయల్దేరాల్సిన హౌరా- సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.05 గంటలకు బయల్దేరుతుంది. ఈనెల 15వ తేదీన బెంగళూరులో ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు–హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.35 గంటలకు బయల్దేరుతుంది.

కోయంబత్తూర్–పోదనూర్ మధ్య రైళ్లు

- కోయంబత్తూర్- బరౌని (06059) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ కోయంబత్తూర్‌లో ఈనెల 14,21 తేదీల్లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడకు, ఈ నెల 16, 23 తేదీల్లో మధ్యాహ్నం 1 గంటకు బరౌని చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో బరౌని–పోదనూర్ (06060) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 16, 23 తేదీల్లో బరౌనిలో రాత్రి 11.45 గంటలకు బయల్దేరి తెల్లవారు 3.48 గంటలకు దువ్వాడకు, 19,26 తేదీల్లో తెల్లవారు 2.45 గంటలకు పోదనూర్ చేరుకుంటుంది.

టాప్‌గేర్‌లో భూ రీసర్వే

అస్తవ్యస్తంగా మారిన భూముల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు.. సాహసోపేతంగా భూముల రీసర్వే చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సత్ఫలితాలు సాధిస్తోంది. బ్రిటిష్ కాలం నాటి భూముల రికార్డుల స్థానంలో ఆధునిక డిజిటల్ భూ రికార్డులను అందుబాటులోకి తీసుకొస్తోంది. మొదటి రెండు విడతల్లో 34 గ్రామాల్లో విజయవంతంగా సర్వే పూర్తి చేసిన అధికారులు.. మూడు, నాలుగు విడతల్లో 46 గ్రామాల్లో భూ సరిహద్దులతో పాటు గ్రామాలకూ సాంకేతిక హద్దులు గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేశారు.

– సాక్షి, విశాఖపట్నం

- తొలి రెండు విడతల్లో 34 గ్రామాల్లో సర్వే పూర్తి
- ఇప్పటివరకు 49,302 హద్దు రాళ్ల ఏర్పాటు
- మూడు, నాలుగు విడతల్లో 46 గ్రామాల్లో సర్వే
- జిల్లాకు కొత్తగా 13 మంది సర్వేయర్ల కేటాయింపు
- డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు

గ్రామాల్లో భూ తగాదాలు లేకుండా ప్రశాంత పల్లెలుగా విరాజిల్లాలి అనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష అనే పథకం తీసుకొచ్చింది. రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా.. భూ యజమానులకు స్పష్టమైన హక్కు కల్పించడం, అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా భూ హద్దులను గుర్తించి ఆ భూమికి రక్షణ కల్పించడమే ధ్యేయంగా జిల్లాలో రీసర్వే జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి డ్రోన్ సర్వే పూర్తయింది. అయితే.. నౌకాదళ పరిధిలో కొన్ని గ్రామాలుండటం వల్ల రీసర్వేకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో నేవీ అధికారులతో కలెక్టర్ డా.మల్లికార్జున సంప్రదింపులు జరిపి.. నేవీ పరిధిలోని గ్రామాల్లోనూ డ్రోన్ సర్వేకు అనుమతులు తీసుకొని శరవేగంగా పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థోరెక్టిఫైడ్ రేడార్ ఇమేజ్(ఓఆర్ఐ) మ్యాప్‌ల సహాయంతో సర్వే పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో 11 గ్రామాల్లోనూ, రెండో విడతలో పూర్తయిన 23 గ్రామాల్లో కలిపి మొత్తం 34 గ్రామాల్లో 49,302 వరకు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది.



సిబ్బంది రీ సర్వే నిర్వహిస్తున్నారిలా...

డిసెంబర్ నాటికి పూర్తికి చర్యలు

మూడో విడతలో 40 గ్రామాలు, నాలుగో విడతో స్వల్ప వివాదాలు, సాంకేతిక సమస్యలున్న ఆరు గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే.. సాంకేతిక సమస్యలను పరిష్కరించి.. మూడో విడతలోనే 46 గ్రామాలను పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే 14 గ్రామాల్లో ప్రాథమిక సర్వే పూర్తయింది. మిగిలిన గ్రామాల్లోనూ పూర్తి చేసేలా జోరుగా పనులు నిర్వహిస్తూ.. డిసెంబర్ 31 నాటికల్లా రీసర్వేను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతీ భూమికి సరిహద్దులను జియో ట్యాగింగ్ ద్వారా నిర్ణయిస్తున్నారు. కేవలం నాలుగు దిశల్లో మాత్రమే కాకుండా.. ప్రతీ ప్రాంతంలో ఎన్ని స్థలాలున్నాయో.. ప్రతీ దిశలో ప్రతీ పాయింట్‌కు జియో కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారిలా...

56 మంది సర్వేయర్లతో..



ప్రస్తుతం 43 మంది సర్వేయర్లతో సర్వే నిర్వహిస్తుండటం కొంత ఆలస్యమైంది. అందుకే అదనంగా సర్వేయర్లను కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. దీనిపై సత్వరమే స్పందించిన ప్రభుత్వం.. అదనంగా 13 మంది సర్వేయర్లని కేటాయించింది. ఇప్పుడు మొత్తం 56 మంది సర్వేయర్లతో 3, 4 విడతల సర్వేను ఏకకాలంలో వేగవంతం చేస్తున్నాం. ఒక్కో వ్యక్తికి ఉన్న భూ సరిహద్దు ఎంత అనే దానికి స్పష్టమైన కోడ్‌ను పొందుపరుస్తున్నాం. ప్రతీ గ్రామంలోని ప్రభుత్వ భూములకు ప్రత్యేక కోడ్‌ను పెడుతున్నాం. వీటితో పాటు ప్రతి గ్రామానికీ జియో కోడ్‌లతో సాంకేతిక సరిహద్దులను ఏర్పాటు చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే మిగిలిన గ్రామాలకు సరిపడిన సరిహద్దు రాళ్లు జిల్లాకు చేరుకున్నాయి. ఓవైపు సర్వే నిర్వహిస్తూ.. మరోవైపు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను సమాంతరంగా చేపడుతున్నాం.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

ధూంధాం దీపావళి

మహారాణిపేట: చిన్నా,పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆహ్లాదపరుస్తూ వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. వారం రోజుల ముందు నుంచే దీపావళి వేడుక సందడిగా ప్రారంభమవగా, ఆదివారంతో ఈ ఉత్సవాల శోభ పతాక స్థాయికి చేరింది. ప్రతీచోట వ్యాపార, వాణిజ్య సముదాయాలు, వివిధ దుకాణాలు మొదలుకుని అన్ని ప్రధాన కూడళ్లు విద్యుద్దీపాల వెలుగులు, పచ్చని తోరణాలు, అందంగా అలంకరించిన పూలతో ముస్తాబై కనిపించాయి. ప్రతి ఇంటి ఆవరణ కూడా దీపపు కాంతులతో దేదీప్యమానంగా వెలుగులు వెదజల్లింది. రాత్రి బాణసంచా వెలుగుల్లో నగరం జిగేల్‌మంది. నగరంలో ప్రముఖులంతా దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.



ఆకాశదీపం వెలిగిస్తూ...



బీచ్ రోడ్డులో దీపావళి వెలుగులు



కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చుతున్న కలెక్టర్ మల్లికార్జున



దీపావళి వేడుకల్లో మహిళలు

ఘనంగా నరకాసుర వధ



నరకాసురుడి వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: నరకచతుర్దశి, దీపావళి సందర్భంగా సింహగిరిపై ఆదివారం రాత్రి నరకాసుర వధ ఉత్సవం ఘనంగా జరిగింది. రాత్రి ఆరాధన అనంతరం ఆలయ వైదికులు.. సింహాద్రి అప్పన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలో, నరకాసురుడి విగ్రహాన్ని మరో పల్లకిలో మాడ వీధుల్లోకి తిరువీధిగా తీసుకొచ్చారు. నరకాసురుడు, స్వామి ఉత్సవమూర్తుల పల్లకీలను ఎదురుఎదురుగా ఉంచి యుద్ధ సన్నివేశాలు నిర్వహించారు. తరువాత నరకాసుర వధ జరిపారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



నరకాసురుడిని, అప్పన్న ఉత్సవమూర్తులను ఉంచి యుద్ధసన్నివేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ.30 లక్షల మేర నష్టం

పెదగంట్యాడ: ఆటోనగర్‌లో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు, పెదగంట్యాడ అగ్నిమాపకదళాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో ఎవర్‌గ్రీన్ పాలిమర్స్ పేరుతో ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమను ఎండీ ఇసాక్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి పరిశ్రమకు తాళాలు వేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడే ఉన్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఆయన పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి, న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో పెదగంట్యాడ ఫైర్ సిబ్బందితో పాటు గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్ నుంచి మొత్తం ఆరు ఫైరింజన్లను తీసుకువచ్చి మంటలను అదుపుచేసేయత్నం చేశారు. అయితే అప్పటికే పరిశ్రమ మొత్తం మంటలు వ్యాపించడంతో అందులోని ప్లాస్టిక్‌తో పాటు మిషనర్, రెండంతస్తుల భవనం దగ్ధమైంది. ప్రమాదంలో రూ.30లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని యజమాని ఇసాక్ తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావాల్సిన బ్రాండ్ లేదన్నందుకు మద్యం దుకాణానికి నిప్పు

- రూ.2 లక్షల ఆస్తినష్టం
- నిందితునికి రిమాండ్

పీఎం పాలెం: తనకు కావాల్సిన బ్రాండ్ మద్యం లేదన్నందుకు ఆగ్రహించి మద్యం షాపునకు నిప్పుపెట్టాడు ఓ మందుబాబు. మద్యం సీసాలు ధ్వంసంగా కాగా మొత్తం రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ సాయిరాంకాలనీకి చెందిన జి.మధు(53) ఈ నెల 11వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో కొమ్మాదిలో గల మద్యం షాపునకు వెళ్లాడు. ఓ బ్రాండ్ మద్యం ఇవ్వాల్సిందిగా కౌంటర్‌లో అడిగాడు. ఆ బ్రాండ్ మద్యం తమ షాపులో లేదని చెప్పడంతో వారితో గొడవకు దిగాడు. షాపు మూసేసిన సమయంలో గొడవకు దిగవద్దని వారించినా.. పట్టించుకోకుండా షాపు తగలెట్టేస్తానని చెబుతూ మరింత రెచ్చిపోయాడు. అంతటితో ఆగకుండా ఓ బాటిల్లో పెట్రోలు తీసుకొచ్చి షాపు కౌంటర్‌పై కుమ్మరించి నిప్పు అంటించాడు. మంటలు చెలరేగడంతో మద్యం షాపు సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు అప్రమత్తమై నిందితుడు మధును పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని నిందితుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో రూ.72,660 విలువ చేసే మద్యం బాటిళ్ల ధ్వంసం కాగా.. కంప్యూటర్, లాగ్ బాక్స్, సీసీ కెమెరా, క్యాష్ మెషీన్, పేటీఎం మెషీన్ కాలి బూడిదయ్యాయి. మొత్తం వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉండవచ్చని సీఐ తెలిపారు. మద్యం షాపు ప్రతినిధి గండిబోయిన నరసింహులు ఫిర్యాదు మేరకు మధుపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ సీఐ మురళీధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



మంటలకు ధ్వంసమైన మద్యం సీసాలు

బాణసంచా కాలుస్తూ 8 మందికి తీవ్ర గాయాలు

మహారాణిపేట: దీపావళి సందర్భంగా బాణసంచా కాలుస్తూ పలువురు గాయపడ్డారు. ఆదివారం రాత్రి, సోమ వారం కేజీహెచ్ బర్న్ వార్డులో గాయపడ్డ ఎనిమిది మందికి కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు ఆధ్వర్యంలో అత్యవసర వైద్య చికిత్సలు చేశారు. వీరిలో కొందరికి శస్త్ర చికిత్సలు కూడా చేశారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్లాస్టిక్ డాక్టర్ మోహనరావు చెప్పారు. బాంబు పేలుస్తుండగా కాగితాల కోవిందరెడ్డి ఛాతి భాగంలో కాలిపోయింది. 30 శాతం గాయపడ్డ గోవింద రెడ్డికి శస్త్ర చికిత్సలు అందించారు. తాళ్లవలస పోలమ్మ 40 శాతం మేర గాయపడింది. బాణసంచా పేలుడు వల్ల బండారు రమేష్ నాయుడు ఎడమ చేతికి, పప్పల దుర్గా ప్రసాద్, కర్రి దుర్గారావుకు కుడిచేతికి గాయమైంది. బద్దిక సురేష్‌కు కుడిచేతి వేళ్లు పూర్తిగా కట్ అయ్యాయి. దీపాలు వెలిగిస్తుండగా జె.మహాలక్ష్మికి చీర అంటుకుంది. ఈమె కూడా గాయపడింది. సోమాల చైతన్య దొర క్రాకర్ బ్లాస్టింగ్ గాయమైంది.



రమేష్ చేతికి గాయం

అలలకు విద్యార్థి బలి

పరవాడ: దీపావళి నాడు స్నేహితులతో కలిసి సముద్రంలో స్నానానికి దిగిన విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన అచ్యుతాపురం మండలం తంతడి తీరంలో ఆదివారం చోటుచేసుకొంది. మండలంలోని అప్పన్నపాలేనికి చెందిన రెడ్డి లోకేష్ (19) మరో ఎనిమిది మంది స్నేహితులతో కలిసి ఆదివారం తంతడి బీచ్‌కు చేరుకున్నారు. అక్కడ స్నేహితులంతా సరదాగా గడిపి సాయంత్రం 4.30 గంటల సమయంలో సముద్రంలో స్నానానికి దిగారు. ఆ సమయంలో ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలకు లోకేష్ లోపలికి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు ప్రమాదాన్ని గమనించి లోకేష్‌ను రక్షించారు. అప్పటికే నీటిలో మునిగిపోవడం వల్ల నీరు తాగేయడంతో స్పృహ కోల్పోయాడు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. లోకేష్ అచ్యుతాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చేతికి అందొచ్చిన కుమారుడిని సముద్రపు అలలు మింగేయడంతో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తండ్రి నూకరాజు దంపతులు బోరున విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పీఎం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.



లోకేష్ (ఫైల్)

'జగనన్న ప్రగతి పథం'పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గురువులు

కొమ్మాది: రాష్ట్ర ఐటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకట్రావు, రవిరెడ్డి, ఐటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మధు సంపత్, రవికాంత్, గిరిధర్, రాష్ట్ర కార్యదర్శి జగదీష్, జిల్లా ఐటీ అధ్యక్షుడు బొండా ఉమ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో సంప్రదింపులకు జనసేన బాధ్యుల నియామకం

మహారాణిపేట : జనసేన, తెలుగుదేశం పార్టీల మధ్య నియోజకవర్గ స్థాయిలో మంగళవారం నుంచి నిర్వహించే సమావేశాలు, ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణకు జనసేన పక్షాన ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు బాధ్యులను నియమించారు. బొలిశెట్టి సత్యనారాయణ (విశాఖ తూర్పు), అంగ దుర్గా ప్రశాంతి (విశాఖ పశ్చిమ), పి.శివ ప్రసాద్ రెడ్డి (విశాఖ దక్షిణ), పసుపులేటి ఉషా కిరణ్ (విశాఖ ఉత్తర), రాయపురెడ్డి కృష్ణ (మాడుగుల), చెట్టి చిరంజీవి (అరకు), వెంపరు గంగులయ్య (పాడేరు), పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి), పంచకర్ల సందీప్ (భీమిలి), కోన తాతారావు (గాజువాక), పీవీఎస్ఎన్ రాజు (చోడవరం), పరుచూరి భాస్కరరావు (అనకాపల్లి), సుందరపు విజయకుమార్ (యలమంచిలి), గెద్దం బుజ్జి (పాయకరావుపేట), ఆర్.సూర్యచంద్ర (నర్సీపట్నం)ను నియమించారు.

భరోసా.. బాధ్యత

- విద్య, వసతి దీవెన పంపిణీలో మరింత పారదర్శకత
- ఇప్పటి వరకు విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు
- ఇక నుంచి స్టూడెంట్-తల్లి జాయింట్ అకౌంట్
- ఈ నెల 24 నాటికి జాయింట్ ఖాతాలు తెరిచేలా ఏర్పాట్లు
- ఈ నెల 28న బ్యాంకు ఖాతాల్లో విద్యాదీవెన డబ్బులు

విశాఖ విద్య: జగనన్న విద్య, వసతి దీవెన పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటి వరకు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండగా, ఇక నుంచి విద్యార్థి జాయింట్ అకౌంట్‌లో డబ్బులు పడనున్నాయి. నిరుపేద వర్గాల ఉన్నత చదువులకు అండగా నిలవాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జగనన్న విద్య, వసతి దీవెన పథకం ప్రయోజనం ద్వారా విద్యార్థుల బాధ్యతను పెంచేలా ఇటువంటి మార్పులకు శ్రీకారం చుట్టారు. డిప్లమో, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే అర్హులైన నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అమలు చేస్తోంది. ఇది పేదవర్గాల పిల్లలకు ఎంతో ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.

జిల్లాలో 27,781 మంది లబ్ధిదారులు

జిల్లాలో 27,781 మంది విద్యార్థులు జగనన్న విద్య, వసతి దీవెన పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. వీరిలో గ్రేటర్ విశాఖ మండలం పరిధిలో 24,109 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా భీమిలి మండలంలో 667 మంది, ఆనందపురంలో 902 మంది, పెదగంట్యాడలో 701 మంది, పెందుర్తి మండలంలో 593 మంది విద్యార్థులు ప్రయోజనం అందుకుంటున్నారు.

ఆ ఐదు బ్యాంకుల్లోనే అత్యధికం..

జిల్లాలో 27,781 మంది విద్యార్థులు జగనన్న విద్య, వసతి దీవెన పథకం ప్రయోజనం పొందేందుకు అర్హులని లెక్కతేల్చారు. వీరిలో 27,310 మందికి బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో 9,028 మంది అకౌంట్లు కలిగి ఉన్నారు. అదే విధంగా యూనియన్ బ్యాంకులో 6,540 అకౌంట్లు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో 4,974, బ్యాంకు ఆఫ్ ఇండియాలో 2,044, కెనరా బ్యాంకులో 1,847 మంది అకౌంటు కలిగి ఉన్నారు. మరో ఏడు బ్యాంకుల్లో వంద నుంచి ఏడు వందల లోపు అకౌంట్లు, మరో 23 బ్యాంకుల్లో వందలోపు చొప్పునే అకౌంట్లు ఉన్నాయి.

లక్ష్యం సాధించేలా..

జిల్లాలో జగనన్న విద్యా, వసతి దీవెన పొందుతున్నవారికి ఇప్పటికే వారి తల్లి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఇదే ఖాతాకు విద్యార్థి పేరుతో జాయింట్ అకౌంట్‌గా మార్పు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమని బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకునేలా సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ నెల 28న 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన డబ్బులు జమ కానున్నాయి. ఈ లోగానే జాయింట్ బ్యాంకు ఖాతాలు ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యా, వసతి దీవెన అందుకోనున్న విద్యార్థులు (ఫైల్)

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ బ్యాంకు ఖాతాలు తెరిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 24 నాటికి లక్ష్యం పూర్తి చేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. జిల్లాలోని ప్రతీ కాలేజీకి ఓ హెచ్‌డబ్ల్యూవోను బాధ్యుడిగా చేసి, దీనిని ఏఎస్‌డబ్ల్యూవో/ఏటీడబ్ల్యూవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచనలకు అనుగుణంగా బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం.

– కె.రామారావు, డిప్యూటీ డైరెక్టర్, విద్యా, వసతి దీవెన జిల్లా నోడల్ అధికారి

